
నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

13 హైదరాబాద్, శనివారం 13 జనవరి 2024 SANGAREDDY

మనోహరాబాద్ మండలం జీడిపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధించింది కేసీఆరే..

గులాబీ అధినేత హయాంలోనే గ్రామాలు అభివృద్ధి

ఇప్పుడొచ్చిన ప్రభుత్వం జిల్లాలు, మండలాలను రద్దు చేస్తానంటున్నది

ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ అమలు చేయాలి

సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

మనోహరాబాద్ మండలం జీడిపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

# ప్రజలపక్షాన ఉంటాం

మనోహరాబాద్, జనవరి 12: ''తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ వల్లనే., చావు నోట్లో తలపెట్టి ఆయన తెలంగాణను సాధించారు.'' అని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మనోహరాబాద్ మండలం జీడిపల్లిలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. అప్పటి కాంగ్రెస్, ఇతర పార్టీలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం నిజాయితీగా కొట్లాడలేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఇంటింటికీ నల్లా నీళ్లు, పంట పొలాలకు కాల్వనీళ్లు తెచ్చుకుని అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఒకప్పటి తెలంగాణ అంటే పని దొరకక, వలసపోయే పరిస్థితి ఉండేదన్నారు. కానీ, కేసీఆర్ తెలంగాణ తెచ్చిన పదేండ్లలో రూపురేఖలు పూర్తిగా మార్చారన్నారు. 24 గంటల విద్యుత్, రూ.200 పింఛన్ రూ.2 వేలు, ఇంటింటికీ తాగునీళ్లు ఇచ్చి ఆడపడుచుల కష్టాలు తీర్చింది కేసీఆర్ మాత్రమేనని గుర్తుచేశారు. ఆడబిడ్డ పెండ్లికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఇచ్చామన్నారు. తూప్రాన్, గజ్వేల్‌లో దవాఖానలు నిర్మించి నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించింది కేసీఆర్ మాత్రమేనన్నారు. కొత్త మండలంగా మనోహరాబాద్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పుడు వచ్చిన కొత్త ప్రభుత్వం ఇన్ని జిల్లాలు, మండలాలు వద్దని అంటున్నదని దుయ్యబట్టారు. మునుపటి లెక్క మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం లేదన్నారు. చేసిన అభివృద్ధికి అండగా ఉండి కేసీఆర్‌ను గెలిపించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునేందుకు, మన గడాను రద్దు చేయడం, మనకు ఏమి చేయకుండా చేసేందుకు కుట్ర జరుగుతున్నదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజలే నిలదీస్తారన్నారు. జీడిపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ గొంతుక అంటేనే మన కేసీఆర్, మన బీఆర్‌ఎస్ అన్నారు. గెలుపు ఓటములు స్పీడు బ్రేకర్ లాంటిదని, మళ్లీ భవిష్యత్ మన చేతికే వస్తుందన్నారు. ఎక్కడ అన్యాయం జరిగినా అండగా ఉంటామని, అసెంబ్లీలో గొంతు విప్పుతామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మెదక్ జడ్పీ చైర్ పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్, రాష్ట్ర ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి,బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పురం మహేశ్ ముదిరాజ్, ఎంపీపీలు పురం నవనీతారవి ముదిరాజ్, కల్లూరి హరికృష్ణ, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, కేసీఆర్ సేవాదల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్కుల మహిపాల్‌రెడ్డి, తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, సర్పంచ్ నాయకుని రేఖామల్లేశ్ ముదిరాజ్, ఎంపీటీసీ స్వర్ణలతావెంకటేశ్, బీఆర్‌ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రతన్‌లాల్, ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు రేణుకుమార్, ఉప సర్పంచ్‌లు ధర్మేందర్, వెంకటేశ్, నాయకులు భాస్కర్, శేఖర్, సాయికుమార్, రాజు, నరేన్, కృష్ణ, ఎల్లేశ్, సత్యం, ప్రకాశ్, నర్సింహులు, జావీద్ పాషా, ప్రవీణ్, గణేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### గెలుసుడు ఆలస్యం.. కరెంట్ పోయింది

**ఎమ్మెల్యే హరీశ్‌రావుతో గ్రామస్తురాలు పెంటమ్మ ఆవేదన..**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి అన్ని వేస్ట్ అయ్యాయి.. గెలుసుడు ఆలస్యమే లేదు కరెంట్ పోయిందని మనోహరాబాద్ మండలం జీడిపల్లికి చెందిన పెంటమ్మ ఎమ్మెల్యే హరీశ్‌రావుతో తన ఆవేదనను వ్యక్తం చేసింది. జీడిపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు హాజరైన ఆయన కాసేపు గ్రామ ఆడపడుచులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పెంటమ్మ కేసీఆర్ సారు ఉన్నప్పుడు అన్ని సక్రమంగా ఉండే. మంచిగ కరెంట్ వస్తుండే... పంటలు బాగా పండుతుండే ఇప్పుడు నాటేయకముందే కరెంట్ పోతున్నది, ఆగమైపోయామని ఆవేదన వ్యక్తం చేసింది.



ఎమ్మెల్యే హరీశ్‌రావుతో ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తురాలు పెంటమ్మ



సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గృహలక్ష్మి లబ్ధిదారులు

# రోడ్డెక్కిన గృహలక్ష్ములు

- గృహలక్ష్మి పథకం పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్
- నారాయణరావుపేట మహిళలు కార్యాలయం ఎదుట ధర్నా
- పరిపాలనపై అవగాహన లేని కాంగ్రెస్ ప్రభుత్వం
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన మహిళలు

నారాయణరావుపేట, జనవరి 12: గులాబీ అధినేత కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కొనసాగించాలని మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలకేంద్రమైన నారాయణరావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెండింగ్‌లో ఉన్న గృహలక్ష్మి పథకం బిల్లులు చెల్లించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మహిళలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడారు. కేసీఆర్ సర్కారు హయాంలో గృహలక్ష్మి పథకం ప్రొసీడింగ్ కాపీలు తీసుకున్నామని చెప్పారు. పాత ఇల్లు కూలగొట్టి అప్పులు తీసుకొచ్చి గృహ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాకపోతే దిగిపోవాలని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలనపై అవగాహన లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మహిళలు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి దిగిపోవాలని మహిళలు అసహనం వ్యక్తం చేశారు. గులాబీ అధినేత కేసీఆర్ వస్తే తమకు బిల్లులు వచ్చేవన్నారు. అనంతరం తహసీల్దార్‌కు మహిళలు వినతి పత్రం అందజేశారు.

### ఇప్పుడు ఏం చేయాలో అర్థమైతలేదు



మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు సహకారంతో ఇల్లు కట్టుకోవడానికి రూ.3 లక్షల ప్రొసీడింగ్ కాపీ ఇచ్చారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రద్దు చేసింది. ఇప్పుడు ఏం చేయాలో మాకు అర్థమైతలేదు. మేము కూలీనాలి చేసుకొని జీవనం కొనసాగిస్తున్నాం. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చే రూ.3 లక్షలతో ఇల్లు కట్టుకుందామని అనుకున్నాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దాన్ని రద్దు చేసింది. మాకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

– నాంపల్లి రాజమణి, ఇబ్రహీంపూర్, లబ్ధిదారు, నారాయణరావుపేట మండలం

### న్యాయం చేయాలి



మాకు ఇల్లు కట్టుకోవడానికి కేసీఆర్ ప్రభుత్వం రూ.3 లక్షల ప్రొసీడింగ్ కాపీ ఇచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత ప్రొసీడింగ్‌ను రద్దు చేసింది. ఎన్నో అప్పులు చేసి ..కూలీ పని చేసుకుంటూ ఇల్లు కట్టుకుంటున్నాం. చాలా ఏండ్ల నుంచి కిరాయికి ఉంటున్న తమకు కేసీఆర్ ప్రభుత్వం ప్రొసీడింగ్ ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రద్దు చేసింది. ఇప్పుడు మేము ఏం చేయాలి.. ఇది న్యాయమా.. తక్షణమే ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలి.

– మిద్దె కళావతి, గుర్రాలగొంది, లబ్ధిదారు, నారాయణరావుపేట మండలం

# నేడు కైట్ ఫెస్టివల్

- ఉత్సవాలను ప్రారంభించనున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేట కోమటి చెరువు నెక్లెస్ రోడ్డు వద్ద కైట్ ఫెస్టివల్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు తదితరులు

సిద్దిపేట, జనవరి 12: సిద్దిపేట కోమటి చెరువు నెక్లెస్ రోడ్డు మరో ఉత్సవానికి సిద్ధమైంది. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని కోమటి చెరువు నెక్లెస్ రోడ్డు వద్ద కైట్ ఫెస్టివల్‌కు శ్రీకారం చుట్టనున్నారు. బీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కైట్ ఫెస్టివల్‌ను శనివారం ఉదయం 11గంటలకు ఆయన ప్రారంభించనున్నారు. ఈ ఉత్సవాల వేళ కోమటి చెరువు వద్ద యువకుల కేరింతల మధ్య వివిధ రంగులు, విభిన్నమైన ఆకృతుల్లో పతంగులు పట్టణ వాసులను కనువిందు చేయనున్నాయి.

**ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు**

బీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న కైట్ ఫెస్టివల్ ఏర్పాట్లను శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. ఆయనతో కౌన్సిలర్ సాయికుమార్, నాయకులు వజీర్, బీసీ విభాగం అధ్యక్షుడు నగేశ్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రజినీకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రెడ్డిప్రభాకర్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు మహిపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు స్వామి వివేకానందుడు

- ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాకలో స్వామి వివేకానంద జయంతి

దుబ్బాక, జనవరి 12: స్వామి వివేకానందుడు యావత్ ప్రపంచానికి ఆదర్శప్రాయుడని, ఆయన ప్రసంగాలు, సూక్తులు యువతకు స్ఫూర్తిదాయకమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాక వైశ్య భవన్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతలో ఉండాల్సిన లక్షణాలను చెప్పిన మొట్ట మొదటి వ్యక్తి స్వామి వివేకానందుడని గుర్తు చేశారు. యువత మంచి లక్ష్యాలతో ముందుకు వెళ్తే తప్పకుండా విజయం సాధిస్తారని సూచించారు. భారతదేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుకున్న స్థాయిలో విద్యావిధానం కొనసాగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు సరైన విద్య అందడం లేదన్నారు.కొన్ని పాఠశాలల్లో 10 నుంచి 30 మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారని, ఇందుకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ సరైన బోధన జరగడం లేదన్నారు. దుబ్బాకలో నిర్మించిన కేసీఆర్ బడిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ట్రస్మా ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడం సంతోషకరమన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని ట్రస్మా ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, ట్రస్మా దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షుడు మాలె రమేశ్ , సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రతినిధులు మహిపాల్‌రెడ్డి, రేపాక భాస్కర్‌రెడ్డి, శంకర్, కౌన్సిలర్లు దేవుని లలిత, ఆస యాదగిరి, బాలకృష్ణగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రాజమౌళి, ఎల్లారెడ్డి, భూంరెడ్డి, శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# హోరాహోరీగా రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీ

**గెలుపొందిన సిద్దిపేట బాలికల జట్టు**



హోరాహోరీగా తలపడుతున్న బాలికల కబడ్డీ జట్లు

గజ్వేల్‌అర్బన్, జనవరి 12: గజ్వేల్ పట్టణంలో జరుగుతున్న 49వ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు రెండోరోజూ హోరాహోరీగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి వరకు 20 జట్లు పోటీ పడగా, శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు 48 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్, ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్, ఉపాధ్యక్షుడు రాజు, కోశాధికారి సత్యంతో పాటు నిర్వహణ కమిటీ సభ్యులు క్రీడాకారులు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. టోర్నీలో తలపడుతున్న క్రీడాకారులకు దొంతుల ప్రసాద్ గార్డెన్స్‌లో భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో వసతి ఏర్పాటు చేయడంతో క్రీడాకారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం, రాత్రి క్రీడలు నిరాటంకంగా కొనసాగుతుండగా ఈనెల 14వతేదీన ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించడంతో పాటు విజేతలకు బహుమతులు అందజేస్తారు. కాగా సిద్దిపేట జిల్లా బాలికల జట్టు యాదాద్రి, సంగారెడ్డి, వరంగల్ జట్లతో తలపడి గెలుపొందింది.

# క్యాలెండర్ ఆవిష్కరణ

సిద్దిపేట కమాన్, జనవరి 12: తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా 2024 క్యాలెండర్‌ను సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా శర్మ, జడ్పీ సీఈవో రమేశ్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ప్ర జా పరిషత్ యూనిట్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కె.రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.రాఘవేందర్ రెడ్డి, గౌరవ సలహాదారు ఐరెని దుర్గా రమణ, అసోసియేట్ అధ్యక్షుడు రామ్ ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ మహ్మద్ గౌసొద్దిన్, అధికార ప్రతినిధి జయరామరాజు, సభ్యులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ తదితరులు

# 31 వరకు సీఎంఆర్ పూర్తిచేయాలి

- మిల్లర్ల అలసత్వాన్ని తీవ్రంగా పరిగణిస్తాం
- మెదక్ కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సీఎంఆర్ ఈనెల 31 వరకు పూర్తి చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. జిల్లాలో అధికశాతం సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లుల యజమానులతో శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఈనెల 31వతేదీ వరకు ఉందన్నారు. 13నెలలు గడుస్తున్నా పూర్తిచేయని మిల్లర్ల అలసత్వాన్ని తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. రైతుల నుంచి ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసి సమకూర్చిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ జరుపుతూ ఈనెలాఖరులోగా ఎఫ్‌సీఐకి చేరవేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి రైస్‌మిల్లులో పూర్తి సామర్థ్యానికి అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తేల్చిచెప్పారు. సీఎంఆర్ కేటాయింపుల్లో జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున ఇకపై మిల్లర్ల అలసత్వాన్ని సహించేదిలేదన్నారు. మిల్లర్లు పంపించే సీఎంఆర్ నిల్వలను వెనువెంటనే దిగుమతి చేసుకునేలా గోదాముల వద్ద కూలీల సంఖ్య పెంచాలని ఎఫ్‌సీఐ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, డీసీఎస్‌వో బ్రహ్మారావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, రైస్ మిల్లర్లు, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

# సంపూర్ణ సహకారంతో ముందుకెళ్లాలి

**సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట, జనవరి 12 : వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖలు సంపూర్ణ సహకారంతో పనిచేస్తూ ముందుకెళ్లాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖలపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా 5వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు శాఖల అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించుకొని గర్భిణులకు అందుతున్న సేవలను పరిశీలించుకోవాలన్నారు. ప్రతి గర్భిణికి మ్యాచింగ్ బ్యాచింగ్ జరపాలని ఆదేశించారు. జనవరి నుంచి గర్భిణుల నమోదు చేయాలని, 12 వారాలలోపు గర్భిణుల నమోదు వందశాతం నిర్వహించాలన్నారు. జనవరిలో గవర్నమెంట్ జనరల్ దవాఖాన సిద్దిపేటలో 500 ప్రసవాలు, గజ్వేల్ దవాఖానలో 450 ప్రసవాలు చేయాలని ఆదేశించారు. ఈ నెల నుంచి ప్రసవానంతరం మొదటిరోజు, మూడోరోజు హెచ్‌బీఎన్‌సీ విజిట్స్ గైనకాలజిస్ట్, పీడీయాట్రిషన్ నిర్వహించాలన్నారు. పాఠశాలల్లోని పిల్లలకు హిమోగ్లోబిన్ టెస్టులు నిర్వహించాలని, తీవ్ర రక్తహీనతతో బాధపడే పిల్లలను దవాఖానకు తరలించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో సిద్దిపేట జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కాశీనాథ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ రజిని, డాక్టర్ విజయరాణి , డాక్టర్ వినోద్ బాబ్జి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# 100శాతం ఓటరు నమోదు కావాలి

**సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్**


సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 12: వందశాతం ఓటరు నమోదు కావాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐబీ నుంచి పాత బస్టాండ్ వరకు ఓట రు నమోదు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డప్పు, గుస్సాడి కళాకారులు, ఒగ్గుడోలు కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం స్థానిక అంబేద్కర్ మైదానంలో కైట్ ఫెస్టివల్, ముగ్గులు పోటీలను ప్రారంభించారు. మహిళలు పాల్గొని ముగ్గులు వేయగా, అదనపు కలెక్టర్ కైట్ ఎగిరేసి ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి అఖిలేశ్‌రెడ్డి, డీఆర్డీవో నగేశ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు ఉన్నారు.




పతంగిని ఎగరేస్తూ కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

# ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు నీటి విడుదల

పుల్కల్, జనవరి 12: బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు నుంచి నీటి పారుదలశాఖ అధికారులు శుక్రవారం ఘనపూర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ప్రతి సంవత్సరం ఇదే సమయంలో ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే జల విద్యుత్ కేంద్రం నుంచి 2,667 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామని నీటి పారుదలశాఖ డిప్యూటీ డీఈ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నది పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు, రైతులు, గొర్లకాపరులు అటువైపు వెళ్లకూడదని హెచ్చరించారు. ప్రాజెక్టు సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 24.775 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.



సింగూరు జల విద్యుత్ కేంద్రం గేటు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు